

రామప్ప భద్రత.. గాలిలో దీపమేనా?

- 20 ఉప ఆలయాల పరిస్థితీ అంతే
- రూ.కోట్లలో అభివృద్ధి పనులు.. అయినా కరువైన రక్షణ
- ప్రపంచ స్థాయి గుర్తింపున్నా కానరాని సీసీ కెమెరాలు
- నిర్వహణపై భక్తుల ఆక్షేపణలు

7


రక్షణ చర్యలకు నోచుకోని రామప్ప దేవాలయం ఆవరణలోని ఉప ఆలయం గొల్లాలగుడి




అది ప్రపంచ వారసత్వ సంపదగా.. యునెస్కో గుర్తింపు పొందిన.. ప్రాచీన శిల్పకళా సంపదకు నిలయమైన రామప్ప దేవాలయం. ఇక్కడ ప్రధాన ఆలయానికి అనుబంధంగా 20 ఉప ఆలయాలున్నాయి. ఈ అద్భుత కట్టడాలను తిలకించేందుకు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. అలాంటి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. రక్షణ మాత్రం కరువైంది. ఇందుకు ఇటీవల రామప్ప అనుబంధ ఆలయమైన గొల్లాలగుడి వద్ద గుప్తనిధుల కోసం జరిగిన తవ్వకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అంతేకాదు ఏకంగా వెయ్యి కిలోల బరువున్న నక్షత్రాకారపు ప్రాకారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కిందికి తోశారు. దీంతో రామలింగేశ్వరుడి రక్షణపై అనుమానాలు పెరుగుతున్నాయి. అయితే రామప్ప పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

\- వెంకటాపూర్ (రామప్ప)

అక్రమార్కుల్లో దడ

నోటీసులు అందించిన మానుకోట అధికారులు

- సీఎం ఆదేశాలతో 'హైడ్రా' తరహా చర్యలు
- ప్రారంభమైన రాజకీయ పైరవీలు
- న్యాయ సలహాల కోసం పరుగులు
- ఏదేమైనా తగ్గేదేలే అంటున్న అధికారులు
- ఇరిగేషన్, రెవెన్యూ గుర్తించిన నిర్మాణాలు
- ఆ నాలుగు చెరువులపైనే అందరి దృష్టి




మహబూబాబాద్‌లో భారీ వర్షం సమయంలో ఎన్నడు లేని విధంగా పట్టణంలో రోడ్డుపై నుంచి వెళ్తున్న వరదనీరు (ఫైల్)

మహబూబాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ డిసాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) తరహా ప్రకంపనలు మానుకోటను తాకాయి. జల ప్రళయం.. వరద భీభత్సం నేపథ్యంలో జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టి చెరువుల అన్యాక్రాంతం, ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు, బఫర్‌జోన్ తదితర అంశాలపై పడడంతో పాటు జల ప్రళయానికి చెరువులు, కుంటల్లో నిర్మాణాలే కారణమన్న కోణంలో అధికారులు కూడా నివేదించడంతో వాటిపై కొరడా ఝులిపించమన్నారు. ఇంకేముంది.. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా అన్నట్టు ఆగమేఘాలపై జిల్లా యంత్రాంగం చెరువులు, కుంటలు, బఫర్‌జోన్‌లు,ఎఫ్‌టీఎల్‌లలో నిర్మాణాలపై నిఘా వేశారు. ఎప్పట్నుంచో ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల దగ్గర ఉన్న సమాచారం తెప్పించుకున్న అధికారులు జిల్లా కేంద్రంతో పాటు మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రధాన చెరువులైన నిజాం, బంధం, కంబాల, రాంభద్ర ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమార్కుల భరతం పట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు నివేదికలను మునిసిపాలిటీకి అందజేయడంతో గత మూడ్రోజులుగా ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఉన్న కొన్ని పక్కా భవనాలతో పాటు షెడ్రూంలకు నోటీసులు ఇవ్వడం ఆరంభించారు. దీంతో అక్రమార్కుల్లో దడ మొదలైంది. ఇది మహబూబాబాద్ మునిసిపాలిటీ వరకే పరిమితం కాదని, తాజాగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లాలోని మిగతా మునిసిపాలిటీలతో పాటు మండలాలు, గ్రామాల్లో చెరువులు, కుంటల అన్యాక్రాంతం, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు, బఫర్‌జోన్‌ల ఆక్రమణలు తదితర అంశాలపై రెవెన్యూ, నీటిపారుదల శాఖ, పోలీస్,పంచాయతీరాజ్‌శాఖలతో పాటుక్షేత్రస్థాయి సర్వేయర్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఎంతటి వారైనా ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, బఫర్‌జోన్‌లు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలుచేస్తే వదిలేదే లేదని తేల్చి చెప్పేశారు. దీంతో అన్ని శాఖల్లోనూ కదలిక వచ్చేసింది. అక్రమార్కుల గుండెల్లో నోటీసుల దడ ఆరంభమైంది. మరోపక్క రాజకీయ పైరవీలకు తెర లేచింది. పెద్ద ఎత్తున ఆక్రమణలు చేసిన వారు న్యాయ సలహాలకై పరుగులు తీస్తున్నారు. మొత్తానికి జిల్లాలో హైడ్రా తరహా మహబూబాబాద్ డిసాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (మాడ్రా) ప్రకంపనలు ఆరంభమయ్యాయి.

ఆ నాలుగు చెరువులపైనే దృష్టి..

మునిసిపాలిటీ స్థాయి నుంచి సాధారణ గ్రామపంచాయతీగా స్థాయి తగ్గిన మహబూబాబాద్ ఆ తర్వాత క్రమంలో దినదినాభివృద్ధితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే మేజర్ గ్రామపంచాయతీస్థాయికి ఎదిగింది. తర్వాత సెకండ్ గ్రేడ్‌మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్‌తో ఈ చుట్టుపక్కల ప్రాంతాల భూముల ధరలకు రెక్కలొచ్చాయి. స్వరాష్ట్ర సాధన ఉద్యమం కూడ దీనికి తోడైంది. క్రమంగా ఎక్కడెక్కడ నుంచో రియల్టర్‌లు వచ్చి ఇక్కడి భూములపై గద్దల్లా వాలడం ప్రారంభించారు. భూమి ధర బంగారమైంది. స్వరాష్ట్రం సిద్ధించింది. మహబూబాబాద్ జిల్లాగా ఆవిర్భవించింది. అప్పటికే అంతా జరిగిపోయింది. జిల్లా కేంద్రానికి నలువైపుల ఉన్న నిజాం చెరువు, బంధం చెరువు, కంబాల చెరువు, రాంభద్ర చెరువుల శిఖాలు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములు, బఫర్‌జోన్‌లలో నిర్మాణాలు యదేశ్చగా జరిగిపోయాయి. ప్రతి దానికి ఏదో ఒక సర్వే నెంబర్ జోడించి అటు ఇరిగేషన్, ఇటు రెవెన్యూ అనుమతులు పొంది కొందరు ఏకంగా బిల్డింగ్‌లు నిర్మించుకున్నారు. తమకు చట్టబద్ధత వచ్చినట్టుగానే తొలుత గ్రామపంచాయతీ నుంచి కొందరు, ఆపై మునిసిపాలిటీ నుంచి మరికొందరు ఇంటి నెంబర్లు నయానో.. భయానో.. ముడుపులు చెల్లించుకుని సాధించుకున్నారు. ఇక తమకు తిరుగే లేదనుకున్నారు. కొందరు ఆ భూములపై రియల్ దందాలు నడిపారు. మరికొందరు అనేక చేతులు మార్చుకుంటూ అక్రమార్జన చేసుకున్నారు. చేతులు మారి కొన్నవారు తమకు ఆ భూములపై హక్కు లభించిందని ధీమా పెంచుకున్నారు. ఇప్పుడు హఠాత్తుగా హైదరాబాద్‌లో హైడ్రా అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ల ప్రయోగం, ఇక్కడ మాడ్రా తరహాలో తొలుత నోటీసుల జారీ ఆయా చెరువుల చుట్టుపక్కల ఉన్న నిర్మాణదారులు, భూ కొనుగోలు దారులను చెమటలు పట్టిస్తోంది.


మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు

ఇరిగేషన్, రెవెన్యూ గుర్తించిన వారికి...

మహబూబాబాద్‌లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు గుర్తించిన బంధం, నిజాం, కంబాల, రాంభద్ర చెరువుల పరిధి కొన్ని బిల్డింగ్‌లు, షెడ్ల నిర్మాణదారులకు తాజాగా మూడ్రోజుల నుంచి మునిసిపాలిటీ శాఖ నోటీసులు జారీ చేస్తోంది. ఆయా నిర్మాణాలకు సంబంధించి అనుమతులు, లింక్ డాక్యుమెంట్‌లు, సదరు భూమి మీ సొంతమని తేల్చే ఆధారాలను మునిసిపాలిటీకి అందజేయాలని కోరుతోంది. మొత్తం నాలుగు చెరువుల పరిధిలో 76 మందికి నోటీసులు సిద్ధం చేసిన అధికారులు రోజు కొందరికి అందజేస్తున్నారు. దీంతో ఆయా నిర్మాణదారులు తమకు ఆ భూములను అంటగట్టిన రియల్ వ్యాపారులను, బడా బాబులను సంప్రదిస్తూ తమపరిస్థితి ఏమిటని తలలుపట్టుకుంటున్నారు. ఆందోళన పడాల్సిన అవసరం లేదు. అవసరమయితే కోర్టుకు వెళ్లైనా స్టే తెచ్చుకుంటే ఎవరు ఏమి చేయరని నచ్చజేబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరికొందరు పదేళ్లలోనే అధికారం మారిన పరిస్థితులను బేరీజు వేసుకుని ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ రాజకీయ నాయకుల వద్ద పైరవీలకు క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు అవినీతికి దూరంగా ఉండాలని, గత ప్రభుత్వంలో అలా ఉండకపోవడం వల్లే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించిన కొద్దిరోజుల ముందే మహబూబాబాద్‌లో చెరువులు, కుంటలు ఆక్రమణలు, బఫర్‌జోన్‌లు, ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేసి ఉన్నారు. ఈ పరిస్థితుల్లో రాజకీయ పైరవీలకు అవకాశం లేదనే చెబుతున్నారు. అదే జరిగితే అధికారులు కొరడ ఝులిపించడం ఖాయమని, అక్రమ నిర్మాణాల కూల్చివేత కూడ తథ్యమని తేలిపోతోంది. ఒక్క మహబూబాబాద్‌లోనే కాదు... డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మునిసిపాలిటీలతో పాటు అన్ని మండలాల్లోనూ ఈ తరహా చర్యలు ఉంటాయని చర్చ జరుగుతోంది. మానుకోట తర్వాత తమవంతు ఎప్పుడు వస్తుందోనని మిగతా మునిసిపాలిటీలు, మండలాల్లోని అక్రమార్కుల గుండెల్లో మాడ్రా దడ ఆరంభమైంది.

పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎంపీ, ఎమ్మెల్యే

మహబూబాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, గార్ల మండలాల్లో మంజూరైన పనుల ప్రారంభానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఖమ్మంజిల్లా ఇల్లందులో సోమవారం నియోజకవర్గ సమీక్షా సమావేశాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన నిర్వహించగా అందులో ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని జిల్లాకు చెందిన బయ్యారం, గార్ల మండలాల అభివృద్ధి పనులపై సమీక్షించారు. బయ్యారం, గార్ల మండలాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, సీసీ రోడ్ల మరమ్మత్తులు ఎంత వరకు పూర్తయ్యాయని అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఏమైనా మంజూరు కాని పనులుంటే వెంటనే ప్రతిపాదనలు పంపించి పనులు చేపట్టాలని శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆయా మండలాల్లో పనులకు సంబంధించి ఎస్టిమేషన్ త్వరగా పంపించి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, కిందకు వేలాడుతున్న తీగలను సరి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయాలని చెప్పారు. ఈ రెండు మండలాలకు సంబంధించి ఒక డయాలసిస్ యూనిట్‌ను మంజూరు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అక్టోబరు 2 నుంచి అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డు, హెల్త్ కార్డు ప్రభుత్వం జారీ చేయనుందన్నారు. బయ్యారం, గార్ల మండలాల్లో రోడ్ల పనుల పరిస్థితి, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పూర్తి, పలు అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వివరించారు. ఈ సమావేశంలో మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్ పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలను సందర్శించిన ఎంపీ

బయ్యారం, సెప్టెంబరు 23 : బయ్యారం మండలం నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ (ఈఎంఆర్ఎస్)ను సోమవారం మానుకోట ఎంపీ పోరిక బలరామ్ నాయక్ సందర్శించారు. ఇటీవల పాఠశాలలో నీటి కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు మహబూబాబాద్ నుంచి బయలుదేరిన ఎంపీ మార్గమధ్యంలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు తగిన సదుపాయాలు కల్పించాలని, మంచి విద్యనందించాలని ప్రిన్సిపాల్, సిబ్బందిని ఆదేశించారు.

ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్


డోర్నకల్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

డోర్నకల్, సెప్టెంబరు 23 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరదముంపునకు గురై రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ విమర్శించారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరుగలేదన్నారు. దీంతో వారు రోడెక్కి నిరసనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ నిమ్మకునీరెత్తినట్లు కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహార్శైలి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానాలు, వేడుకల్లో మునిగి తేలుతున్నారని, వరద బాధితులను ఆదుకోకుండా గాలికి వదిలేశారని మండిపడ్డారు. వరదల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోవడంతో రైతుల పంటలకు నీరు పెట్టే పరిస్థితి లేదని అన్నారు. పంట నష్టపరిహారం ఇంత వరకు చెల్లించకపోవడం బాధకరమన్నారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ అంగోతు బింధు, బీఆర్ఎస్ నాయకులు మన్యపాట్నీ, బోరగళ్ల శరత్‌బాబు, యశోదర్‌జైన్, కొత్త వీరన్న, విద్యాసాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ


కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ అన్నారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 133 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 32, వ్యవసాయ శాఖ 09, మహబూబాబాద్ మునిసిపాలిటీ 11, గ్రామీణాభివృద్ధి శాఖ 04తో పాటు వివిధ శాఖలకు సంబంధించి మొత్తంగా 133 దరఖాస్తులు ప్రజల నుంచి వచ్చాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి సుబ్బారావు, ఆడిషనల్ డీఆర్‌డీఏ జయశ్రీ, సూపరిండెంట్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

కక్షలు వద్దు.. రాజీ మార్గమే రాజమార్గం


డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అదనపు ఎస్పీ చెన్నయ్య

డోర్నకల్, సెప్టెంబరు 23 : కక్షలతో ఏమి సాధించలేమని.. దేనికైన రాజీ మార్గంతోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని మహబూబాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. సోమవారం డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన కొందరు కుటుంబసభ్యులకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. వృద్ధులను అనవసరంగా ఇబ్బందులకు గురిచేయొద్దని, వారిని చూసుకోవాల్సిన బాధ్యత వారి కుమారులు, కుమార్తెలపై ఉందన్నారు. చిన్న చిన్న కేసులకు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగి సమయం వృధా చేసుకోవద్దని సూచించారు. సమస్యలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పారు. అనంతరం డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏఎస్పీ వెంట డోర్నకల్ సీఐ రాజేష్ సిబ్బంది ఉన్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధం

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి - సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23: జమిలీ ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం దీని ద్వారా ప్రజలకు ఏం లాభమో చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి ఇంట్లో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి జరిపినా అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు జరపడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాష్ట్రాలపై పెత్తనం చెలాయించేందుకే కేంద్ర ప్రభుత్వం జెమిలీ ప్రతిపాదనలు తీసుకువస్తుందన్నారు. కులగణన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయడం అమానుషమన్నారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతపై తమకు అభ్యంతరం లేదన్నారు. పేదల ఇండ్లను కూల్చివేస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. రూ. 1400 కోట్లతో నిర్మిస్తున్న ఎల్కతుర్తి-రామాయణపేట హైవే నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలన్నారు. ఈ నెల 26న హైవేపై సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ అందరి రైతులకు అందడం లేదన్నారు. ఇటీవల వియత్నాం దేశ పర్యటనకు వెళ్లి వచ్చిన చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావును సీపీఐ నాయకురాలు మంచాల రమాదేవి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, బీ సంపత్, అశోక్, స్టాలిన్, రమాదేవి, రామచంద్రా రెడ్డి, తిరుపతి, ఆదరి రమేష్, మార్పు సంజీవరెడ్డి, గడ్డం రాజ నర్సు, కృష్ణారెడ్డి, రొంటాల శ్యామ్, వేల్పుల చరణ్, రవితేజ, బీ సదానందం తదితరులు పాల్గొన్నారు.

కేయూ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు అరుదైన అవకాశం

అస్ట్రేలియా అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23: కాకతీయ యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు అరుదైన అవకాశం లభించింది. అక్టోబరు 3,4 తేదీల్లో అస్ట్రేలియా ఖండంలోని పెర్త్ నగరంలో జరిగే ప్రతిష్ఠాత్మక అట్లాంటిక్ ఫెడరేషన్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. సదస్సులో ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ' మ్యాథమేటికల్ టెక్నిక్స్ ఇన్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్ (ఐసీఎంటీఈఏ-24) ఏ సొల్యూషన్ టూ పజి స్టోకాస్టిక్ లీనియర్ సిస్టమ్స్ యూజింగ్ ట్రయాంగులర్ అండ్ స్యూసిమెట్రిక్ స్ప్లిటింగ్ ఇంటరేటివ్ మెథడ్ అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయనను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ .మల్లారెడ్డి, మ్యాథ్స్ విభాగం ప్రొఫెసర్లు భారవిశర్మ, సోమయ్య, తిరుమలదేవి అభినందించారు.

రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణానికి రూ. 60 కోట్ల నిధులు

బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23 : హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్లు, పలు బ్రిడ్జీల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 60కోట్ల నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ ఎంఆర్ఆర్ గ్రాండ్ల కింద రూ. 10కోట్లు, పంచాయతీరాజ్ సీఆర్ఆర్ గ్రాండ్ల కింద రూ. 50కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండలం మల్లారం ఎక్స్ రోడ్ నుంచి రసూల్‌పల్లిలో రూ. 86లక్షలతో బీటీ రోడ్, భీమదేవరపల్లి మండలంలోని అవల్దార్‌పల్లి ఆర్అండ్‌బీ రోడ్ నుంచి ఎర్రబెల్లి వరకు రూ. 37లక్షల బీటీ రోడ్, గట్లనర్సింగాపూర్, లంబాడితండ ఎక్స్ రోడ్ వరకు రూ. 374లక్షలు, ముల్కనూర్ ఎస్‌బీహెచ్ నుంచి కొత్తపల్లి ఎక్స్ రోడ్ వరకు రూ. 135లక్షలు, భీమదేవరపల్లి మండలం కొప్పూర్ ఎక్స్ రోడ్‌కు రూ. 117లక్షలు, మండలంలోని వంగర ఎర్రగడ్డ కల్వర్టు నిర్మాణం, బ్రిడ్జీ నిర్మాణానికి రూ. 80లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటితో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23 : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు సోమవారం ముగిసాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించిన చెస్ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 100మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందని క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. రెండు రోజుల పాటు క్రీడాకారుల మధ్య నువ్వా నేనా అనే విధంగా గెలుపే లక్ష్యంగా పోటీ తత్వాన్ని ప్రదర్శించారు. బాలుర విభాగంలో జి. విద్యాధన్, ఎం. అభినవ్ రెడ్డి, అల్లాడి శ్రీవాత్సవ్, డి. జితేష్ బాలికల విభాగంలో జాన్వీ తోట, పి. లక్ష్మీశార్వాణి, కె. ఆరాధ్య, ఎం. హాస్య లు అత్యుత్తమ ప్రతిభతో రాణించి అక్టోబరు చివరి వారంలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని కన్నా వెల్లడించారు. ఈ మేరకు విజేతులుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలు, ఎస్‌ఐల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 23: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ సోమవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలు ఎం.అబ్బయ్య సీసీఎస్ వరంగల్ నుంచి నర్మెట్ట, ఎం.సాయిరమణ నర్మెట్ట నుంచి దుగ్గొండి అలాగే ఎస్‌ఐలు చింత రాజు ఇంతజార్‌గంజ్ నుంచి కొడకండ్ల, ఎస్.రాజన్‌బాబు వరంగల్ ట్రాఫిక్ నుంచి జనగాంకు బదిలీ అయ్యారు.

ఫాంహౌస్ పాలన కాదు మాది ప్రజాపాలన

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వంగపహాడ్‌లో పీఏసీఎస్ నూతన భవనం ప్రారంభం



వంగపహాడ్‌లో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఫాంహౌస్ నుంచి మానిటరింగ్ చేసిన ప్రభుత్వం మాది కాదని ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నుకోబడిన నిజమైన ప్రభుత్వం మాది అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్‌లో పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనం, గోదామును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతిగా పని చేస్తున్నా కొందరు బీఆర్ఎస్ నాయకులు, ట్విట్టర్ వేదికగా కామెంట్స్ చేయడం సరైంది కాదని మండి పడ్డారు. గత ప్రభుత్వాలు రైతులకు రుణ మాఫీ చేయాలంటే అష్టకష్టాలు పడేవారని కాం గ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సారే రూ. 2 లక్షల రుణ మాఫీ చేశాడని గుర్తు చేశారు. ఇంకా కొందరు రైతులకు రుణమాఫీ విషయంలో కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని త్వరలో పరిష్కారం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్‌లో ట్వి ట్టర్ టిల్లు, కౌశిక్‌రెడ్డి వంటి అటెన్షన్ డైవర్షన్ బ్యాచ్ పని చేస్తుందని గుర్తు చేశారు. సోషల్ మీడియా వేదికగా దుర్ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు.

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం వంగపహాడ్ పీఏసీఎస్ ఏపీబీ బ్యాంకు నుంచి డీసీసీబీకి మార్చమని పాలక వర్గం సభ్యులు చాలా సార్లు కోరారని అతి త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రుణమాఫీ కానీ రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదని అందరికి న్యాయం జరుగుతుందన్నారు. దసరా కానుకగా రైతులు పండించే వరి ధాన్యానికి రూ. 500 బోనస్, రైతు భరోసా ఇవ్వనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం పీఏసీఎస్ భవనం రూ. 30 లక్షలతో నిర్మాణం జరిగిందని చైర్మన్ మేరుగు రాజేశ్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీవో నీరజ, డీసీసీబీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, వంగపహాడ్ పీఏసీఎస్ డైరెక్టర్లు రుద్రారపు రాజు, మేరుగు రేణుక, గండు అశోక్ యాదవ్, పావం జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ టాప్ శాస్త్రవేత్తలలో

వరంగల్ ప్రొఫెసర్‌కు చోటు



డాక్టర్ రమేశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23: ప్రపంచ టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో వరంగల్ జిల్లా నర్సంపేట మెడికల్ కళాశాల బయో కెమిస్ట్రీ ఇన్‌చార్జి విభాగం అధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు చోటు దక్కింది. ఇటీవల స్టాన్ ఫర్డ్, కాలిఫోర్నియా, ఎన్సివియర్ విశ్వవిద్యాలయాలు కలిసి ప్రపంచంలోని టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాను రూపొందించాయి. ఈ జాబితాలో డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు స్థానం దక్కింది. 2021-2023 కొనసాగే ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో స్థానం సంపాదించారు. న్యూరో సర్జరీ, న్యూరో శాస్త్రంపై అనేక పరిశోధనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న ఏకైక వ్యక్తిగా నిలిచారు. అమెరికాలోని నాసా, ఏమోరి యూనివర్సిటీ, జార్జియా టెక్ యూనివర్సిటీ, టెక్సాస్ విశ్వవిద్యాలయం లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో వివిధ హోదాల్లో పని చేశారు. డాక్టర్ రమేశ్ 100కు పైగా పరిశోధన పత్రాలను, అల్జీమర్స్, స్కిజోఫీనియా, ఆంటి వ్యాధులపై ప్రచురించారు. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల జాబితాలో స్థానం దక్కించుకున్న డాక్టర్ కందిమల్ల రమేశ్‌ను పలువురు ఐఎంఏ వైద్యులు ప్రశంసించారు.

కొనసాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23 : కాకతీయ మెడికల్ కాలేజీ వార్షిక ఉత్సవం ఉత్కర్ష 24 కార్యక్రమం మూడవ రోజు ఉత్సాహంగా కొనసాగింది. సోమవారం ఇంపల్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సైక్లింగ్, పరుగెత్తడం, జంపింగ్, క్లైంబింగ్, ఇతర క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నారు. క్రికెట్ ఫైనల్స్‌లో పోస్టు గ్రాడ్యుయేట్లు చాంపియన్‌షిప్‌ను గెల్చుకున్నారు. సాయంత్రం విద్యార్థులు చిత్రలహరి (షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్) ఇందులో మెడికల్ విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించారు. కాకతీయ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు డాక్టర్ భరత్, డాక్టర్ మౌనిక దంపతుల కూతురుకు ఉత్కర్ష అనే పేరు పెట్టారు. కేఎంసీలో మాకు చాలా నేర్పిందని, కాలేజీ మీద ఉన్న ప్రేమతో తమ కూతురికి ఉత్కర్ష అనే పేరును పెట్టినట్లు వారు తెలిపారు. మంగళవారం విద్యార్థులు మెగా రక్త దాన శిబిరం, సాయంత్రం కార్నివల్ నైట్ నిర్వహించనున్నారు.

పలు రైళ్లు ఆలస్యం

కాజీపేట, సెప్టెంబరు 23 : కాజీపేట టౌన్ - హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య ఎఫ్ క్యాబిన్ వద్ద సోమవారం మూడో లైన్ బైపాస్ పనులు చేపట్టారు. రైల్వే అధికారులు పర్యవేక్షణలో 400 మంది గ్యాంగ్‌మెన్‌లు ఒక యూనిట్‌గా ఏర్పడి లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టారు. నాలుగు గంటలు బ్లాక్ తీసుకుని ఈ పనులు చేపట్టడంతో కాజీపేట, బల్లార్షా, వరంగల్ రైల్వే స్టేషన్ల మార్గంలోని పలు రైళ్లు అలస్యంగా నడిచాయి. పనుల అనంతరం రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఈ పనులు డిప్యూటీ సీఈ భార్గవ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భటియా, టీఐ అగ్గి రవీందర్, పీడబ్ల్యూ గోపిల పర్యవేక్షణలో చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

'నూతన జాతీయ పెన్షన్ స్కీంతో ప్రయోజనాలు'

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : నూతన జాతీయ పెన్షన్ స్కీంతో ఉద్యోగులకు ఎన్నో ప్రయో జనాలు ఉన్నాయని ఏపీ రాజమండ్రి ఆదికవి నన్నయ్య వర్సిటీ కామర్స్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఉద యభాస్కర్ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో అకూట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి అధ్యక్షతన నేషనల్ పెన్షన్ స్కీంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేసిన ఉదయభాస్కర్ మాట్లాడుతూ. ప్రతి ఒక్క ఉద్యోగి తప్పనిసరిగా ఎన్‌పీఎస్‌లోకి మారాలని ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వం అడిట్ అభ్యంతరాలను వ్యక్తం చేస్తోందని సూచించారు. 80 సీడీసీ కింద ఐటీ కోసం ఎన్‌పీఎస్ అవసరం ఉంటుందని చెప్పారు. అనంతరం వర్సిటీ ఉద్యోగ సంఘాల నేతలు డాక్టర్ మామిడాల ఇస్తారి, వల్లాల తిరుపతి, పోలేపాక కోర్నేల్‌లు మాట్లాడుతూ.. వర్సిటీలో ఉద్యోగులు, అడ్మినిస్ట్రేటీవ్ అధికారులు తమను ఎన్‌పీఎస్‌లోకి మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కామర్స్ విభాగం ప్రొఫెసర్ రాజేందర్ నలుగురితో కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ సదస్సులో వర్సిటీ ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

'రామప్ప' భద్రత.. గాలిలో దీపమేనా?

- రూ.కోట్లలో అభివృద్ధి పనులు.. అయినా కరువైన రక్షణ
- ప్రపంచ స్థాయి గుర్తింపున్నా కానరాని సీసీ కెమెరాలు
- నిర్వహణపై భక్తుల నుంచి వ్యక్తమవుతున్న ఆక్షేపణలు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 23 : యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి రక్షణ కరువైంది. పర్యాటకంగా ప్రపంచ పటంలో ఉన్నత స్థానం పొందినా స్థానికంగా మాత్రం ఈ వారసత్వ సంపదకు రక్షణ కరువైంది. ఇక ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న 20 ఉప ఆలయాల భద్రత గాలిలో దీపంగా మారింది. రూ.కోట్లు వెచ్చించి రామప్పను అభివృద్ధి చేస్తున్నా రక్షణ కల్పించడంలో మాత్రం అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది. తాజాగా గొల్లాలగుడి తవ్వకాలే ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న రామలింగేశ్వరుడి రక్షణపై భక్తుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి.

వీఐపీలు వచ్చినప్పుడే రక్షణ

సుప్రసిద్ధ రామప్ప దేవాలయానికి 2022 జూలైలో యునెస్కో గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు రావడం కోసం కేంద్ర పురావస్తుశాఖ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టాయి. గుర్తింపు తీసుకొచ్చేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. గుర్తింపు వచ్చాక రాష్ట్రపతి మొదలు అనేక మంది వీవీఐపీలు రామప్పను సందర్శించిన సమయంలో మాత్రమే పోలీసులు రక్షణగా వస్తున్నారు. ఆ తరువాత మళ్లీ యథావిధిగా రామలింగేశ్వరుడికి రక్షణ కరువవుతోంది.

ఉప ఆలయాలనూ గాలికొదిలేశారు..

రామప్ప ఆలయానికి అనుబంధంగా 20 ఉప ఆలయాలు, ప్రధాన ఆలయాలు చుట్టుపక్కల ఉన్నాయి. వాటి రక్షణను అధికారులు గాలికి వదిలేస్తున్నారు. ఫలితంగా గొల్లాలగుడిలో గుర్తుతెలియని దుండగులు తవ్వకాలు చేపట్టారు. ఏకంగా 1000కిలోల బరువు ఉన్న నక్షత్రాకారపు ప్రాకారాన్ని పైకప్పు కిందికి తోశారు. కిందకు తోశాక ప్రాకారం పైభాగంలో పుష్పాకారంలో ఉన్న టంకాన్ని పగులగొట్టారు. ఇదంతా ఒకరిద్దరు కలిసి చేసిన పనికాదని జరిగిన ఘటనను పరిశీలిస్తే తెలుస్తోంది. స్థానికుల సహకారం ఉంటే తప్ప ఇంత బరువును కిందికి తోయలేరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం కనుక ఈఘటనను సిబ్బంది చూసి ఉండకపోతే దుండగులు మరికొన్ని ఉప ఆలయాలపై కూడా ఇదే తరహాలో దాడులకు పాల్పడి ఉండేవారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పనులు చేస్తున్నా సీసీ కెమెరాలు కరువు

యునెస్కో గుర్తింపు పొందిన అనంతరం రామప్ప పరిసర ప్రాంగణంలో రూ.కోట్లు వెచ్చించి చేస్తున్న పలు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. అటు కాంట్రాక్టర్లు కానీ, ఇటు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు కానీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ పర్యాటకులకు ఏదైనా ఇబ్బంది ఏర్పడితే కనీసం గుర్తించేందుకు సీసీ కెమెరా లు కూడా లేవు. పైగా ఆలయం వద్ద ఇలాంటి సెక్యూ రిటీని కూడా నియమించకపోవడం పట్ల సర్వత్రా వి మర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ గుర్తింపు వచ్చినా ఇంకా అభద్రతలోనే రామప్ప ఆలయం ఉంద ని స్థానికులు వాపోతున్నారు.

టంఖంలో వజ్రాలు ఉన్నాయనే..

రామప్ప ఆలయానికి సమీపంలోని గొల్లాలగుడిలో రెండురోజుల క్రితం గుప్తనిధుల కోసం తవ్వకాలు జరి గినట్టు వెలుగులోకి వచ్చిన క్రమంలో ఆలయం పై భాగంలో ఉన్న పుష్పాకారపు పైకప్పు భాగంలో ఉన్న టంఖాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఆటంఖంలో వజ్ర, వైఢూర్యాలు ఉన్నాయనే ఆశతో కొందరు వ్యక్తు లు దానిని పగులగొట్టిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పైభాగం నుంచి కిందికి తీసుకురావడానికి సుమారు 10మంది ప్రయత్నంచేస్తే తప్ప ఆ ప్రకారం కిందికి వచ్చే అవకాశంలేదని స్థానికులు భావిస్తున్నారు.

20 ఉప ఆలయాల పరిస్థితీ అంతే



రామప్ప దేవాలయం ఆవరణలోని గొల్లాలగుడి



దీపశిఖలతో చెక్కిన టంఖం

రామప్ప గుడులకు రక్షణ కల్పించాలి

ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు, రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్



రామప్ప ప్రధాన ఆలయం తోపాటు దాని పరిధిలో ఉన్న గుడులను వెలికితీసి వాటికి ర క్షణ కవచాలను ఏర్పాటు చేసి ఆలయాలకు భద్రత కల్పించా లి. గొల్లాలగుడి పైకప్పు దీప శిఖలో అనేక కళాకృతులు చెక్కి ఉండేవి. అలాంటి అనేక కళాకృతులు మరుగునపడి ఉన్నాయి. వాటి ని నియంత్రిత రక్షణ వ్యవస్థ పరిధిలో ఉంచాలి. అలాగే పురావస్తుశాఖ రక్షణ, నిర్వహణ సిబ్బంది ని పెంచాలి.

ప్రధాన ఆలయంపై కన్నేస్తే ఇక అంతే..

రామప్ప ప్రధాన ఆలయం పరిధుల్లో దుండగులు ఎలాంటి తవ్వకాలు చేపట్టినా అంతర్జాతీయ పర్యాటక సమాజం ముందు తలదించుకోవాల్సి వస్తుంది. కనీస స్థాయి భద్రత కల్పించకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. ప్రపంచ పర్యాటక ముఖచిత్రంలో ఉన్న త స్థానం సంపాదించిన రామప్పకు ఇప్పటికైనా రక్షణ కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

గొల్లాలగుడిని సందర్శించిన కలెక్టర్ దివాకర

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 23: మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయం తూర్పు రోడ్డు, గొల్లాల గుడిని సోమవారం ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామప్ప దేవాలయం తూర్పు రోడ్డు అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ఏరియా మ్యాపింగ్ సర్వేచేసి బౌండ్రీ పిల్లర్ ఫిక్స్ చేయాలన్నారు. కెనాల్‌కు సంబంధించిన ఏరియా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయన రామప్ప ఉప ఆలయాల్లో ఒకటైన గొల్లాలగుడిని సందర్శించి గుడి పైకప్పు, దెబ్బతిన్న శిఖరం, పైకప్పులో వికసించే తామరపువ్వు గుర్తుతో ఉండి పూర్తిగా ధ్వంసమైన శిల్పాన్ని పరిశీలించారు. దేవాలయం పూర్తి వివరాలను పురావస్తు శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దేవాలయంలో ధ్వంసమైన శిల్పం, పువ్వు, అన్ని డాక్యుమెంట్ చేయాలని, రాత్రి కాపలాదారుడిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ అధికారి మల్లేశం, ఇరిగేషన్ డీఈ రవీందర్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో రాజు, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



ధ్వంసమైన శిల్పాలను పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర



ప్రాజెక్టు పనుల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

చిన్న కాళేశ్వరంపై చిగురిస్తున్న ఆశలు

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్, కాటారం, మల్హర్, మహాముత్తారం మండలాలకు సాగునీరు అందించేందుకు గాను చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. సుమారుగా 45వేల ఎకరాల పంట భూములకు నీరందించేందుకు ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ చూపి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష జరిపి చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి 70వేల ఎకరాల భూ సేకరణకు రూ.14 కోట్లు, వీరసాగర్‌లో సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరాకు రూ.31.39 కోట్ల నిధులు మంజూరైనట్లు ఈఈ యాదగిరి తెలిపారు. ప్రస్తుతం ఈఈ పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

నేడు కాళేశ్వరానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాక

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి సన్నిధికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, కమిషనర్ హన్మంతరావులు మంగళవారం రానున్నారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధానంలో సరస్వతి పుష్కరాలపై సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే సరస్వతి పుష్కరాల సమావేశాలు నిర్వహించడానికి ముందస్తుగా కాళేశ్వరంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. అలాగే రూ.25 కోట్లతో 8ఏళ్ల క్రితం మంజూరైన పనులపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది.

30న విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: హంటర్‌రోడ్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఈ నెల 30న పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈవో డి. వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయిలో విజేతలైన విద్యార్థులు దక్షిణ భారత స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొంటారని, అక్కడ విజేతలైన విద్యార్థులు జనవరి 2025లో బెంగుళూరులో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామిని సంప్రదించాలని ఆమె సూచించారు.

బోగస్ పాలనతో కేసీఆర్ ప్రజలను మోసం చేశారు

- ప్రజల అభిప్రాయాలను పట్టించుకోలేదు
- ఇప్పటి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం
- కేయూ సింపోజియంలో సామాజిక వేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న హరగోపాల్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : కేసీఆర్ పాలనంతా బోగస్‌గా సాగిందని, తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ప్రముఖ సామాజిక వేత్త, రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో కేయూ ఆర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బానోతు సురేశ్‌లాల్ అధ్యక్షతన 'డికెడెల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ ఇష్యూస్ చాలెంజేస్' అనే అంశంపై సింపోజియం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలందరూ ఉద్యమం చేసి ఆశించిన డెమోక్రటిక్ పాలిటిక్స్‌కు బదులుగా విరుద్ధమైన పాలన సాగించారని విశ్లేషించారు. బీఆర్ఎస్ పాలన నిర్బంధం, నిరంకుశత్వంతో పాలన సాగిందన్నారు. కేసీఆర్ పాలనలో అక్రమంగా 221 కేసులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ వర్సిటీలకు భారీగా నిధుల్లో కోత విధించిందని, వర్సిటీ స్వయం ప్రతిపత్తిని ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

ప్రత్యేక అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అప్పట్లో అధికారం చేపట్టగానే తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు, వలసలతో పాటు అస్తిత్వం కోల్పోయిన యువత ఆకాంక్షలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే తమది పక్క రాజకీయ పార్టీ అంటూ రాష్ట్రం కోసం పోరాడిన మేధావులు, యువత, విద్యావేత్తల ఆలోచనలు పట్టించుకోలేదని అన్నారు. ఖరీఫ్‌లో రైతుల పేరుతో నమోదైన భూములను ధరణి పోర్టల్‌లో సాయంత్రం పని ప్రారంభించి రాత్రికి తమకు అనుకూలమైన పేర్లకు మార్చేవారని అన్నారు. కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలోని మిగతా నీటి ప్రాజెక్టుల్లో అవకతవకలు, అవినీతి జరిగిందన్నారు. కేసీఆర్ తన హయంలో రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని ధ్వజమెత్తారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి కీలక ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రం నీళ్ళు, నిధులు, నియామకాల కోసమే అంటూ ప్రగల్భాలు పలికినప్పటికీ తీర రాష్ట్రం సిద్ధించిన తర్వాత వాటిని మరిచారని అన్నారు. తమిళనాడుతో పోలిస్తే తెలంగాణలో విద్య ప్రమాణాలు తక్కువగా ఉన్నాయని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. అర్థశాస్త్రంలో దత్తాంశాల ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. వర్సిటీల్లో ఫ్యాకల్టీతో పాటు నిధుల కొరత ఉందన్నారు. పాలక మండలి సభ్యులు పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ.. వరంగల్‌లో డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ మాట్లాడుతూ.. అభివృద్ధి హైదరాబాద్‌లో కేంద్రీకృతం కాకుండా రాష్ట్రమంతా విస్తరించాలని చెప్పారు.

కేయూ ఆర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి, సమస్యలు, సవాళ్లకు సరైన మార్గదర్శనంగా సింపో జియం నిర్వహించినట్లు తెలిపారు. మాజీ వీసీ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు, కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ప్రొఫెసర్ గుగులోత్ వీరన్నానా యక్, ప్రొఫెసర్ సీహెచ్. సమ్మయ్య కృష్ణమాచారి, పరిశోధకులు జి.రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల నియామకానికి త్వరలో నోటిఫికేషన్?

- సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన వీసీ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కోదండరాంకు వినతి పత్రాన్ని ఇస్తున్న వర్సిటీ డాక్టరేట్ అభ్యర్థులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : కాకతీయ యూనివర్సిటీలో ఏడేళ్లుగా పార్ట్‌టైం అధ్యాపకుల నియామక నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం, వర్సిటీలో విద్యార్థులకు బోధన సక్రమంగా జరగకపోవడం, విద్యార్థులు పడుతున్న పలు ఇబ్బందులను వివరిస్తూ 'పాఠాలు చెప్పే వారేరీ' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి.. సమస్య గురించి రాష్ట్ర ఉన్నతా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లతో త్వరలోనే నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ మేరకు తమకు వీసీ నుంచి సమాచారం అందిందని వర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌లు, పార్టుటైం ఆశావాహులు తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని తాము రిజిస్ట్రార్ వద్దకు తీసుకెళ్లామని, వర్సిటీలో ఉన్న పరిస్థితులను విన్నవించామని, రిజిస్ట్రార్ మల్లారెడ్డి స్పందించి.. పార్టుటైం నోటిఫికేషన్ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వీలైనంత త్వరగా ఉన్నతాధికారుల అనుమతిలో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇదిలా ఉండగా సోమవారం వర్సిటీ సెనెట్ హాల్‌లో జరిగిన అర్థశాస్త్ర విభాగం సింపోజియంలో వర్సిటీల్లో పార్టుటైం నియామకాల్లేవనే అంశాన్ని పలువురు మాట్లాడారు. వర్సిటీలో అధ్యాపక నియామలు చేపట్టకపోవడంతో ఒక తరానికి నష్టం చేసినట్లేనని ఆందోళన వ్యక్తం చేశారు.

స్పందించిన ఎమ్మెల్సీ కోదండరాం..

సోమవారం వర్సిటీకి వచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన పీహెచ్‌డీ డాక్టరేట్లు, ఆశవహులు 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనాన్ని చూపించారు. సమస్యలను విని స్పందించిన కోదండరాం వెంటనే వర్సిటీ క్యాంపస్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో చర్చించారు. పార్ట్‌టైం నోటిఫికేషన్ విడుదలకు ఉన్న ఇబ్బందులపై ఆరా తీశారు. రాష్ట్ర ఉన్నత విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణల దృష్టికి తీసుకెళ్లి పార్టుటైం నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఆదేశించారు. దాంతో తాము ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలపై దృష్టి సారించామని.. వీలైనంత త్వరగా ఇస్తామని వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ వర్సిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపల్లి మధు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత డాక్టర్ పాలమాకుల కొమురయ్య, బీఆర్ఎస్వీ వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి రంజిత్, డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌లు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రాన్ని అందచేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

27న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, వరంగల్, హనుమకొండలోని అపోలో ఫార్మసీ కేంద్రాల్లో ఫార్మసిస్ట్/అసిస్టెంట్/అప్రెంటిషిప్‌గా పనిచేసేందుకు 50 ఖాళీలకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు గల డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు వారి జీరాక్స్ సర్టిఫికేట్లతో ఈ నెల 27న ములుగు రోడ్‌లోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి విరాలకు 78933 94393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

వరంగల్ వ్యవసాయ మార్కెట్ ధరలు
(క్వింటాల్‌కు-రూ.లలో)

పంట	గరిష్టం	కనిష్టం
మక్కలు (బిల్టీరకం)	2,660	2,405
పల్లికాయ (సూక)	5,600	4,500
పల్లికాయ (పచ్చిది)	4,400	3,800
కందులు	8,059	7,575
పెసళ్లు	7,652	4,052
పత్తి	7,650	5,500
కొత్తపత్తి	7,225	6,500
పసుపు (కాడి)	13,130	12,000
పసుపు (గోల)	12,455	10,800
తేజ మిర్చి	12,500	10,000
తేజ ఏసీ	18,800	14,000
వండర్‌హాట్ ఏసీ	15,000	13,000
యూఎస్341 ఏసీ	16,500	11,000
తాలు మిర్చి	6,000	3,000

- వరంగల్ వ్యవసాయం



శివాత్మికను విజేతంగా ప్రకటిస్తున్న న్యాయనిర్ణేతలు

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో శివాత్మికకు బంగారు పతకం

హనుమకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండకు చెందిన సిహెచ్ శివాత్మిక అండర్ 17 (42 కేజీ) విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 650మంది పోటీ పడ్డారు. వీరందరిని దాటుకొని విజేతగా నిలిచిన హనుమకొండ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన శివాత్మిక నవంబర్ నెలలో ఉత్తరాఖండ్‌లో జరుగబోయే జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలలో పాల్గొనేందు కు ఎంపికయ్యారు. బంగారు పతకం సాధించిన శివాత్మికను తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అంజనేయులు, వైస్‌ప్రెసిడెంట్ బండారి సంతోష్, కోచ్‌లు రామ్‌చందర్, సాగర్, కర్ర వెంకటేశ్, సిహెచ్ కరుణాకర్, సీహెచ్ సుప్రియ, పి దినేష్, ఏ గణేష్, యూ రణదీప్, జి వైష్ణవి అభినందించారు.

చిలుపూర్‌లో పట్టపగలు దొంగతనం

- హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు
- ఓ ఇంట్లో చొరబడి మూడు తులాల గొలుసు చోరీ



చిలుపూర్‌లో దొంగతనం జరిగిన తీరును బాధిత మహిళను అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

చిలుపూర్, సెప్టెంబరు 23 : పట్టపగలు హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఆగంతకుల్లో ఒకరు ఓ ఇంట్లోకి ప్రవేశించి, ఒంటరిగా ఉన్న మహిళను కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న మూడు తులాల గొలుసుకును లాక్కెళ్ళాడు. అనంతరం బైక్‌పై ఇద్దరూ పారిపోయారు. ఈ ఘటన చిలుపూర్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత మహిళ జంగిటి రాధిక -లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాధిక తన భర్త వివిధ పనుల నిమిత్తం వరంగల్‌కు వెళ్ళడంతో మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఇంట్లో కూర్చుని టీవీ చూస్తోంది. ఈ లోగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఇంటి ముందు ఆగారు. ఒకరు బైక్ దగ్గర ఉండగా, మరొక వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. వచ్చీరాగానే కత్తితో పొడిచి చంపుతానని మెడలో ఉన్న బంగారం ఇవ్వాలని బెదిరించాడు. అతడిని ప్రతిఘటించే ప్రయత్నం చేసిన ప్రయత్నం ఫలించకపోగా, ఆమె మెడలో ఉన్న మూడు తులాల (రూ.2.50 లక్షల విలువ గల) బంగారు గొలుసును లాక్కెళ్ళి పారిపోయారు. బాధిత మహిళ రాధిక -లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీపతిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రూ. 2.15 లక్షల నగదు, 10 తులాల బంగారం, 5 తులాల వెండి అపహరణ

చిలుపూర్, సెప్టెంబరు 23 : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 2.15లక్షల నగదుతో పాటు, 10తులాల బంగారం, 5 తులాల వెండి ఎత్తుకెళ్ళిన ఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని శ్రీపతిపల్లిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మూడికె లక్ష్మికి భర్త కొన్నేళ్ళ క్రితం చనిపోగా, కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. కొడుకును చూడడం కోసం ఐదు రోజుల క్రితం లక్ష్మి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దొంగలు ఆదివారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి సొత్తును దోచు కెళ్ళారు. సోమవారం ఉదయం ఇంటికి వెసిన తాళం పగులగొట్టడాన్ని గమనించిన సమీప బంధువులు ఆమెకు ఫోన్ ద్వారా సమాచారమందించారు. దీంతో సమీప గ్రామంలో లక్ష్మి కుమార్తె హారిక గ్రామానికి చేరుకుంది. బీరువా తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించింది. సమాచారమందుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐ ఎడవెళ్లి శ్రీనివాసరెడ్డి, చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్‌తో కలిసి చిలుపూర్, శ్రీపతిపల్లి గ్రామాలకు చేరుకున్నారు. దొంగతనాలు జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. దొంగలను పట్టుకోవడం కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 : నవోదయ పాఠశాలల్లో ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు మామునూరు నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ బి. పూర్ణిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. https://navodaya.gov.in అనే వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

'పద్మావతి' హాల్టింగ్ అయోమయం

- నెక్కొండలో డౌన్‌కు ఓకే.. అప్‌కు నో...
- ప్రైవేట్ యాప్‌లలో తప్పుడు సమాచారంతో ప్రయాణికుల ఇబ్బందులు



ఓ యాప్‌లో నెక్కొండలో హాల్టింగ్ చూపుతున్న దృశ్యం

నెక్కొండ, సెప్టెంబరు 23 : సికింద్రాబాద్-తిరుపతి (12764 / 12763) పద్మావతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ విషయంలో ప్రయాణికుల్లో అయోమయం నెలకొంది. నెక్కొండ రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉండగా.. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే రైళ్లకు హాల్టింగ్ లేదు. ఈ క్రమంలో సికింద్రాబాద్ వైపు వచ్చే ఎక్స్‌ప్రెస్‌కు అప్ హాల్టింగ్ ఇప్పించాలని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌ను కోరారు. దాంతో మూడు నెలలుగా నెక్కొండ స్టేషన్‌లో అప్ హాల్టింగ్ ఇప్పించారు. కానీ అది మున్నాళ్ల ముచ్చటే అయింది. ఈనెల 15 నుంచి అప్ హాల్టింగ్‌ను రద్దుచేశారు. కానీ ప్రైవేట్ యాప్‌ల్లో మాత్రం నెక్కొండలో పద్మావతి అప్ హాల్టింగ్ చూపుతుండడంతో తికమకపడుతున్నారు. ఇక తిరుపతి పుణ్యక్షేత్రానికి నిత్యం వందల మంది వెళ్తుంటారు. నెక్కొండ స్టేషన్‌లో రైలు ఎక్కి తిరుపతి వెళ్లి.. తిరుగుప్రయాణంలో అదే రైల్లో నెక్కొండకు రావాలని భావిస్తున్నారు. కానీ ఈ స్టేషన్‌లో రైలు ఆగకపోవడంతో వరంగల్‌లో దిగాల్సి వస్తోంది. కొన్ని ప్రైవేట్ యాప్(ఆన్‌లైన్)లో నెక్కొండ స్టేషన్‌లో అప్ పద్మావతి హాల్టింగ్ చూపించడంతో ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, సెప్టెంబరు 23 : రాష్ట్రంలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉటుందని, పేదింటి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నాడని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తొర్రూరు మండలానికి సంబంధించిన 85 మంది లబ్ధిదారులకు రూ.85లక్షల విలువ గల కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతీ పేదవాడికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషిచేస్తున్నాడన్నారు. వారం రోజుల్లో అర్హులైన లబ్ధిదారులందరూ కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో నర్సింగరావు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు జినుగ సురేందర్ రెడ్డి, సంతోష్, సోమ రాజశేఖర్, మేకల కుమార్, బషీర్, తూనం శ్రావణ్, బిజ్జాల అనిల్, దొంగరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్‌పంప్

తొర్రూరు రూరల్: తొర్రూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని గూర్తుర్ క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్‌ను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. పీఏసీఎస్ రైతులకు ఎంతో సహకారం అందిస్తూ, రవాణా సౌకర్యార్థం రూ.50లక్షల వ్యయంతో పెట్రోల్‌పంప్ ఏర్పాటు చేయడం అభినం దనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, వర్కింగ్ ప్రసిడెంట్ మేకల కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో నర్సింగరావు, కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, లింగాల వెంకటనారాయణ గౌడ్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌పంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

మీ సేవా కేంద్రాల్లో సమస్య పరిష్కారం

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23: జిల్లాలో గత కొన్ని రోజులుగా ఎస్‌డీసీ సర్వర్ సమస్యతో మీ సేవా కేంద్రాల్లో తలెత్తిన సాంకేతిక సమస్యలు తొలగిపోయి సమస్య పరిష్కారమైందని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక సమస్యలతో రెవెన్యూ కార్యాలయంలో మీ సేవా నిర్వాహకులు, దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. జూలై 10 నుంచి సెప్టెంబరు 12 మధ్య తేదీల్లో వివిధ సర్టిఫికెట్ల కోసం అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్‌లకు మీసేవా యాక్సెస్‌పై సాంకేతిక సమస్య ప్రభావం చూపిందన్నారు. తద్వారా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల బ్యాక్ లాగ్ ఏర్పడిందని అట్టి సమస్య ప్రస్తుతం పరిష్కరించబడిందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఎక్కడైతే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసకున్నారో అక్కడకు వెళ్లి సంబంధిత పత్రాలతో అప్‌లోడ్ చేయించుకోవాలన్నారు. మీ సేవా ఆపరేటర్లు తప్పనిసరిగా పత్రాలను మళ్లీ అప్‌లోడ్ చేయాలని తెలిపారు. 13 సెప్టెంబరు తర్వాత నుంచి దరఖాస్తులు సాదారణంగా ప్రాసెస్ చేయబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలాల్లోని మీ సేవా కేంద్రాల్లో ఆపరేటర్లు నిర్వహిస్తున్న అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు.

బస్సులోనే మద్యం తాగిన ఆర్టీసీ ఉద్యోగులు!

వీడియో తీసిన ప్రయాణికులు.. సోషల్‌మీడియాలో వైరల్

తొర్రూరు, సెప్టెంబరు 23 : కొందరు ఆర్టీసీ ఉద్యోగులు బస్సులోనే మద్యం తాగి బాధ్యతారహితంగా వ్యవహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరుతూ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 21న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన ధర్నాకు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డిపోనకు చెందిన 10 మంది ఉద్యోగులు తరలి వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో తొర్రూరు డిపో బస్సులోనే ప్రయాణికులతో కలిసి వస్తూ మార్గమధ్యలో మద్యం కొనుక్కొని తాగుతుండగా ప్రయాణికులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా వారు లెక్కచేయకుండా మద్యం తాగగా.. కొందరు ప్రయాణికులు ఆ దృశ్యాలను వీడియో తీసి సోషల్‌మీడియాలో పెట్టడంతో వైరల్ అయ్యాయి. బాధ్యత గల ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులున్న బస్సులోనే మద్యం తాగడమేంటన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. దీనిపై ఆర్టీసీ డీఎం పద్మావతిని వివరణ కోరగా వీడియోలు వైరల్ అయిన విషయం తమ దృష్టికి వచ్చిందని, ఆ రోజు విధుల్లో ఉన్న డ్రైవర్, కండక్టర్లను విచారిస్తున్నామని, ధర్నాకు తరలిన ఉద్యోగులు విధుల్లోలేరని తెలిపారు. కండక్టర్‌ను స్పేర్‌లో ఉంచామని ప్రస్తుతం సరిపడా డ్రైవర్లు లేనందున ఆ బస్సు డ్రైవర్‌ను విధుల్లో ఉంచామని, విచారణ పూర్తయిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యల వలయంలో ఈదులపూసపల్లి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజమౌళి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23: మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి అన్నారు. ఈదులపూసపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కమిషనర్ రవీందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. మునిసిపల్ ఒకటవవార్డు పరిధిలోని ఈదులపూసపల్లిలో సైడ్ కాల్వల్లో చెత్త చెదారం నిండడంతో దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. దోమలు వ్యాప్తి చెంది డెంగీ వంటి వ్యాధులు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైడ్ కాల్వలను శుభ్ర పరిచి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గి లక్ష్మీనారాయణ, బోయిని లక్ష్మణ్, పుట్ట సర్వేశ్వర్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ పోస్టర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23: మహబూబాబాద్ పట్టణంలో పీడీఎస్‌యూ 50 వసంతాల సభల పోస్టర్లను సోమవారం ఆసంఘం పూర్వ ప్రస్తుత నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ పూర్వ నాయకులు బలాష్టి రమేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు మాట్లాడుతూ.. 1974 లో పీడీఎస్‌యూ ఏర్పడిందని విద్యారంగ సమస్యలపై, శాస్త్రీయ విద్యాసాధన కోసం, సమసమాజస్థాపన, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పీడీఎస్‌యూ పోరాడుతూ వస్తుందని పేర్కొన్నారు. అక్టోబరు 4న జిల్లా కేంద్రంలో, 24న ఉస్మానియా యూనివర్శిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే పీడీఎస్‌యూ 50 వసంతాల సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చుంచు శ్రీశైలం, కొమిరె వెంకన్న, సూర్యం, మండల వెంకన్న, రాకేష్, శ్రీశైలం, మహేందర్, మనోజ్, నాగరాజు, మహేష్, లింగ్యా, విజయ్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్‌గా అనిల్

నెల్లికుదురు, సెప్టెంబరు 23: ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్‌గా నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు మర్సకట్ల అనిల్‌ను నియమించినట్లు కాకతీయ యునివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఈసం సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్‌గా అత్యుత్తమసేవలు అందించినందుకు జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్‌గా ఎంపికైనట్లు తెలిపారు. తన ఎంపికకు కృషి చేసినవారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తొర్రూరు, సెప్టెంబరు 23: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన పెయింటర్ మంగళపల్లి యాకయ్య(40) రిక్షా కాలనీలో నివాసం ఉంటున్నాడు. గత రాత్రి భార్యతో గొడవ పడి తెల్లవారుజామున ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం బ్లాక్‌డే నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా చేశారని వాపోయారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ. 26 వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్తుల వెంకన్న, జనార్ధన్, యాకన్న, వెంకట్‌నారాయణ, శ్రీను, హేమా, లాలు, పుల్లయ్య, రాజు, వీరన్న, వెంకన్న, యాదగిరి పాల్గొన్నారు.

● కేసముద్రం: కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్రం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కేసముద్రంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లేబర్ కోడ్‌ను ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జల్లే జయ రాజ్, సుంచు శ్రవణ్, లింగాడపు యాకయ్య, దుర్గం ఏసు, తాళ్ల వెం కన్న, ధైద తిరుపతయ్య, దుర్గం వెంకన్న, మైదం పవన్, తేళ్ల సంజీవ, వి.లలిత, కొంగర కవిత, పాల్గొన్నారు.

● నెల్లికుదురు: వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీ సం వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మం డల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో సీఐటీ యూ మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు,పెరమాండ్ల తిలక్, బొల్లం ఎల్లయ్య, రవి, ఐలేష్, శ్రీను, యాకన్న, చాంద్‌పాష, విజయ వెంకన్న, మల్లయ్య, బికన్ పాల్గొన్నారు.

● కురవి: కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని సీఐటీయూ మండల కార్యదర్శి పోతుగంటి మల్లయ్య అన్నారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సోమవారం బ్లాక్ డే, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుజాత, గుగులోతు సరోజ, హేమలత, జ్యోతి, ఉపేంద్రాచారి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

గార్ల, సెప్టెంబరు 23 : ఏజెన్సీ ప్రాంతాల్లో కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గార్ల గౌడ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సోమవారం ఇల్లందులో కలిసి వినతిపత్రం అంజేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న కల్లుగీత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచము కిట్లు అందించాలని కోరారు. 60 సంవత్సరాలు దాటిన కల్లుగీసే కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మీ, తాళ్లపల్లి కిష్టాగౌడ్, సమ్మయ్యగౌడ్, కొత్తకోట కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

పునర్నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చడం తగదు

● సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23: మహబూబాబాద్ మునిసిపల్ 12వవార్డు పరిధిలో రెండు దశాబ్దాల కిందట ఏర్పాటైన తలారి వెంకటేశ్వర్లు కాలనీలో వితంతు మహిళ పునర్ నిర్మించుకుంటున్న ఇంటిని కూల్చడమేంటని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి ప్రశ్నించారు. కూల్చిన ఇంటి నిర్మాణాలను సోమవారం సీపీఐ ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 20 ఏళ్ల క్రితం భూపోరాటాల ఫలితంగా ఏర్పడిన కాలనీలో మద్దినేని నర్సమ్మ అనే వితంతు మహిళ ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిందని, ఈక్రమంలో ఇంటిని పునర్‌నిర్మాణం చేసుకుంటున్న తరుణంలో నిర్మాణాలను మునిసిపల్, రెవెన్యూ అధికారులు జేసీబీతో నేలమట్టం చేశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇళ్ల జోలికి వెళ్లవద్దని చెబుతుంటే ఇక్కడ అధికారులు మాత్రం అనాలోచిత చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు వెలుగు శ్రావణ్, అశోక పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేసిన కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడ, సెప్టెంబరు 23 : ఇటీవల కురిసిన భారీవర్షాలకు వచ్చిన వరదకు ఓటాయి క్రాస్‌రోడ్, పొగుళ్లపల్లి మధ్య రోడ్డు తెగిపోవడంతో బస్ సర్వీస్ నిలిచిపోయింది. దీంతో ఓటాయి, సాధిరెడ్డిపల్లి, కోనాపురం, రేణ్యాతండా, ఎంచగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలిసిన మంత్రి సీతక్క రోడ్డును మరమ్మతులు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులను ఆదేశించింది. దీంతో మండలంలోని కాంగ్రెస్ నాయకులు చల్లా నారా యణరెడ్డి, కర్ర జనార్ధన్ రెడ్డి, సుభాష్‌రెడ్డి మొరం పోయించి రోడ్డు మరమ్మత్తు చేయించారు. అనంతరం డిపో మేనేజర్ వెంకటేశ్వర్లుకు రోడ్డు సమస్య, మరమ్మత్తు గూర్చి వివరించి బస్ సర్వీసును నడిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

కళాశాలను సందర్శించిన తక్కెళ్లపల్లి

● కలిసి కట్టుగా భవన మంజూరుకు కృషి చేద్దాం ● 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



కళాశాలను సందర్శిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23: మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సోమవారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి సందర్శించారు. ఈ నెల 20న ఆంధ్రజ్యోతి జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకున్న అంశంపై చరిత్రఘనం.. భవనం శిథిలం.. అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సోమవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సందర్శించారు. తాను విద్యాబుద్దులు నేర్చుకున్న తరగతి గదిని పరిశీలించి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కళాశాల మొత్తం తిరిగి శిథిలవస్థకు చేరుకున్న భవనాన్ని పరిశీలించారు. అనంతరం కళాశాల అధ్యాపకులచే సమావేశమై కళాశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు... ఎన్ని గదులు కావాలి.. అనే విషయాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో టీపీజేఏసీ కో కన్వీనర్ మైస శ్రీనివాస్ కళాశాల భవన పరిస్థితి, కావాల్సిన తరగతి గదులు, ఇతరత్రా అంశాలను ఎమ్మెల్సీకి వివరించారు.

తొలుత భవన నిర్మాణ సాధన కమిటీని ఏర్పాటు చేసుకుని కళాశాల శిథిల భవన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు తెలిపారు. పార్టీలకతీతంగా అంతా కలిసికట్టుగా కళాశాల భవన నిర్మాణానికి కృషి చేద్దామని పేర్కొన్నారు. తన సీడీపీ నిధుల నుంచి కూడా కళాశాల అభివృద్ధి కోసం కేటాయిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వైస్ ప్రిన్సిపాల్ గణేష్, ఎడ్ల వేణు, బీఆర్ఎస్ నాయకులు మార్నేని రఘు, జేరిపోతుల వెంకన్న, మంగలంపల్లి కన్న, బోనగిరి గంగాధర్, శివ, టీపీజేఏసీ సత్యనారాయణ, జానీ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణ

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ రిటైర్డ్ ప్రోగాం ఆఫీసర్ కూతురు సత్యనారా యణ మాట్లాడుతూ... ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజసేవకు పునరంకితం కావాలని, క్రమ శిక్షణ, సేవాభావం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్‌లను రెండు రకాలుగా నిర్వహిస్తారని అందులో ఒకటి కళాశాల లెవల్, రెండవది స్పెషల్ క్యాంపులుగా నిర్వహిస్తారని చెప్పారు. తమ యొక్క పర్సనల్ డెవలప్‌మెంట్ పెంపొందించుకోవడానికి, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడానికి ఎన్ఎస్ఎస్ చక్కని వేదిక అని తెలిపారు. అనంతరం సత్యనారాయణను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, ప్రిన్సిపాల్లు వై. కృష్ణ ప్రసాద్ , గట్ల శ్రీపాల్‌రెడ్డి, అధ్యాపకులు కె. ప్రసాద్, ముత్తయ్య, ఎస్. ప్రసాద్, బి. ఉప్పలయ్య పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

● మానుకోట డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 23 : విద్యార్థులు ఇష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకుని తల్లిదండ్రులు కన్న కలలను సాకారాం చేయాలని మానుకోట డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. మహబూబాబాద్ మండలం రెడ్యాల గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో నూతన చట్టాలు, సైబర్ క్రైమ్, గంజాయి నిర్మూలనపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, ఫోక్సో, షీటీమ్, యాంటీహ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించి అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిసకావొద్దని సూచించారు. ప్రతి ఒక్కరు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు వాలీ, క్రికెట్, క్యారం కిట్లను అందజేశారు. సమావేశంలో హెచ్‌ఎం సక్రునాయక్,పీడీ మోహన్‌నాయక్, ఉపాధ్యాయులు వెంకన్న, లక్ష్మిదేవి, లక్ష్మయ్య, శారద, సుదర్శన్, హన్మంతు, విజయ్‌కు మార్, శ్రీనివాస్, పుల్య, అరుణ్‌కుమార్, దేవ్లా, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా..

పెద్దవంగర, సెప్టెంబరు 23: కార్యకర్తలను కాపాడుకుంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని కొరిపెల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎర్ర వెంకన్నకు ప్రమాదవశాత్తు బైకు ప్రమాదంలో గాయాలుకావడంతో ఆయన కుటంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీజీ చైర్మన్ గాంధీనాయక్, బీఆర్ఎస్ అధ్యక్షుడు ఈదరు ఐలయ్య, శ్రీరాం సుధీర్, యాదగిరిరావు, ఉన్నారు.

జ్వరంతో వ్యక్తి మృతి

కొత్తగూడ, సెప్టెంబరు 23: చికిత్స పొందుతూ మండలంలోని మైలారం తండాకు చెందిన బాధావత్ స్వామి (30) సోమవారం మృతిచెందాడు. బాధావత్ స్వామి గతకొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రి చికిత్సనందిస్తుండగా స్వామి మృతిచెందాడు. మృతునికి భార్య జ్యోతి, ఇద్దరు కూతుర్లు హర్షిత, వైష్ణవి, కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు.

వరద సాయం అందజేయాలి

కేసముద్రం, సెప్టెంబర్ 23 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తన దుకాణం పూర్తిగా మునిగిపోయి సుమారు రూ.2లక్షల వరకు నష్టపోయానని ప్రభుత్వం తనను ఆదుకోవాలని మండల కేంద్రానికి చెందిన ఓ దివ్యాంగుడు కలెక్టర్‌ను సోమవారం వేడుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం స్టేషన్‌కు చెందిన దివ్యాంగుడైన ఎలుగు వెంకన్న కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో డబ్బా గుమ్మి ఏర్పాటు చేసుకొని సౌండ్ బాక్సులు కిరాయి ఇవ్వడం, దేవుళ్ల ఫొటోలను, పూజా సామాగ్రిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల వచ్చిన వర్షాలకు ఆయన దుకాణంలోకి ఐదు అడుగుల మేర వరద నీరు వచ్చింది. దీంతో దుకాణంలో ఉన్న వస్తువులు, సామాగ్రి పూర్తిగా దెబ్బతినడంతో తాను సమారు రూ.2 లక్షల వరకు నష్టపోయానని తెలిపాడు. అయితే తనకు పరిహారం అందించేందుకు జీపీ సిబ్బంది ఎవరూ కూడా వివరాలను తీసుకోలేదని దీంతో తనకు వరద సాయం అందలేదన్నాడు. ఇప్పటికైనా తనకు సాయం అందించి ఆదుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరాడు.

తనిఖీలతోనే అక్రమాలకు అడ్డుకట్ట

పెద్దవంగర, సెప్టెంబరు 23 : ఉపాధి హామీలో చేపట్టే సామాజిక తనిఖీలతోనే అక్రమాలకు అడ్డుకట్ట వేయడం జరుగుతుందని ఈజీఎస్ అడిషనల్ ఏపీడీ శాంత కుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మూడో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ పనులకు వచ్చే విధంగా ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో ఎలాంటి అక్రమాలు జరుగకుండా సామాజిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుమాధవ్, ఏపీవో బిందు, ఆదామ్, ఎస్ ఆర్‌పీ కుమార్, రమేష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎండోవ్‌మెంట్ సెల్ జిల్లా ఇన్‌చార్జ్ కన్వీనర్‌గా సతీష్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 23 :భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎండోవ్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్‌గా గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన సింగారపు సతీష్‌ను నియమించినట్లు రాష్ట్ర బీజేపీ ఎండోవ్‌మెంట్ సెల్ జాయింట్ కన్వీనర్ సుదర్శన్ ప్రసాద్ తివారి సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సుదర్శన్ ప్రసాద్ తివారి మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లాలోని పురాతన దేవాలయాలు, ప్రస్తుతం నడుస్తున్న దేవాలయాలు, అభివృద్ధికి నోచుకోని దేవాలయాలు, తదితర వాటి వివరాలు తెలుసుకోవాలన్నారు. దూప, దీప, నైవేధ్యం నోచుకోని వంటి దేవాలయాల్లో కనీస వసతులు కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, పైండ్ల శ్రీనివాస్, ఇందు భారతి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని

కలెక్టరేట్ ఎదుట ఆందోళన

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23: తమకు న్యాయం చేయాలని మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం మరిపెడ మండలం సీతారాం తండా వరద బాధితులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా తండా మహిళలు సంపూర్ణ, బుజ్జి మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.16,500 పరిహారం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం రూ.10 వేలు అందించి చేతులు దులుపుకుందని అన్నారు. సీతారాంతండాలో 50 కుటుంబాలున్నాయని తండాలో మూడు డ్వాక్రా గ్రూపులున్నాయని ఒక్కో గ్రూపు రూ.20 లక్షల రుణం, అలా మూడు గ్రూపులకు రూ.60 లక్షల రుణం తీసుకున్నారని తెలిపారు. పంటలు నష్టపోవడంతో ప్రస్తుతం తాము డబ్బులు చెల్లించే పరిస్థితిలో లేమని, డ్వాక్రా గ్రూపులకు ఇచ్చిన బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జి. నీల, శిరీష, కౌసల్య పాల్గొన్నారు.

కేసముద్రం మండలం మహిమూద్ పట్నం శివారు భూక్యరాం తండాకు చెందిన గిరిజనులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తండా వాసులు వెంకన్న, సురేష్ మాట్లాడుతూ.. తండాకు చెందిన 36 మందికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నివాస స్థలాలిచ్చారని చెప్పారు. స్వరాష్ట్రం సిద్ధించాక బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత అదే భూమిని మళ్లీ వేరే వారికి కేటాయించడంతో ఒక్కో నివాస స్థలానికి ఇద్దరికి పట్టాలున్నాయని తెలిపారు. తమ నివాస స్థలాలు తమకు దక్కేలా న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, నరేష్, గోపాల్, బి. వెంకన్న, జి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలి



తొర్రూరులో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న మహాసభ నాయకులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 23 : తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యథాతథంగా కొనసాగించాలని ఆర్యవైశ్యమహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగేటి అశోక్, కార్యదర్శి ప్రతాపని పాండు రంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ముఖ్యంగా తెలుగు మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరహార దీక్ష చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పొద్దుటూరి గౌరిశంకర్, నాళ్ల నరసింహరావు, వేమిశెట్టి కిశోర్‌కుమార్, బోనగిరి గిరిధర్‌గుప్తా, కృష్ణమూర్తి, సదాశివుడు, మురళి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వేణుగోపాల్, నాగన్న, సుమతి పాల్గొన్నారు.

● తొర్రూరు: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొన సాగించాలని కోరుతూ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌరీశంకర్ మాట్లాడుతూ ఆయన పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి యథావిధిగా కొనసాగించాలన్నారు. ఎమ్మెల్యే యశస్విని మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బిజ్జాల అనిల్, రాంమ్మూర్తి, రామ ఉపేందర్, వెంకటరమణ, ఇమ్మడి రాంబాబు, శ్రీనివాస్, రవి, మధు, రమేష్, పాల్గొన్నారు.

● మరిపెడ : పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మారిస్తే ఆర్యవైశ్యులను రాష్ట్ర ప్రభుత్వం అవమానించినట్లేనని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తల్లాడ వెంకట్రామారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం మరిపెడ ఆర్యవైశ్య సంఘ బాధ్యులతో కలిసి ఆయన స్థానిక తహసీల్దార్ సైదులుకు వినతి పత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిప్పిరిశెట్టి గోవర్ధన్, కర్లపాటి మధు, గర్రెపల్లి కాంతారావు, బుద్దా శ్రీనివాస్, హరిప్రసాద్, అనిల్, ఉల్లి రాము, సుధాకర్, కందిబండ ప్రసాద్, ఉప్పల వెంకన్న, దేవేందర్, మురళీ, తల్లాడ సురేశ్, శ్రీనివాస్, గర్రెపల్లి వెంకన్న, ఉప్పల నాగరాజు, శ్రీరంగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● గూడూరు: పొట్టి శ్రీరాములు యూనివర్శిటీ పేరును ప్రభుత్వం మార్చేందుకు యత్నిస్తోందని ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని గూడూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొండూరి ఉమామహేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్నిసోమవారం తహసీల్దార్ శ్వేతకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గౌరి శంకర్, దొడ్డ శ్రీనివాస్, ఆనంద్, కోటేశ్వర్, సురేష్, యుగంధర్, వెంకటేశ్వర్లు, సాయి పాల్గొన్నారు.